
లయ బద్ధంగా వినిపిస్తున్న రైలు శబ్దంలో మార్పు వచ్చింది. రైలువేగం తగ్గింది. స్టేషనులోకొచ్చి ఆగింది. రైలు ఎక్కేటప్పుడున్న తొందర, హడావిడి దిగేటప్పుడు వుండవు. పెట్టెలోని చాలామంది అప్పటికే చుట్టబెట్టి సిద్ధం చేసుకున్న సామానులతో దిగిపోతున్నారు. అందరికన్నా వెనుక సూట్‌కేస్ చేతబట్టుకొని కదిలాను నేను. అప్పటికే రైలెక్కవలసిన వాళ్ళు తొక్కిడిగా తోసుకుంటూ వచ్చేస్తున్నారు. వాళ్లలో ఎలాగో చోటు చేసుకుంటూ రైలు దిగాను. ప్లాట్‌ఫారమంతా హడావిడిగా వుంది. చేతిలో పెట్టెలతో సంచులతో పరుగెత్తి అనువైన పెట్టెతలుపు దగ్గర చేరుకుంటున్నారు ప్రయాణీకులు పళ్ళు, పుస్తకాలు, సిగరెట్లు వగయిరాలు అమ్మేవాళ్ళు అరుస్తూ తిరుగుతున్నారు. ఈ సందడంతా కొన్ని నిముషాలే. కొద్దిసేపట్లో రైలు కదిలిపోయింది. ప్లాటుఫారంలో కోలాహలం తగ్గింది.

నే నెక్కవలసిన రెండవరైలు రావడానికింకా ఒకటిన్నర గంట టైముంది. రైల్వే కాంటీనులో టిఫిన్, కాఫీ తీసుకున్నాను. ఒకసారి ప్లాటుఫారం ఆ చివరి నుండీ ఈ చివరివరకు పచారు చేశాను దూరంగా ఒక వైపున వేపచెట్టుక్రింది ఏకాంతంగావున్న సిమెంటు బెంచీ నన్నాకర్షించింది. దానిపై కూర్చొని చూస్తే దూరాన ఎక్కడో మైదానంలో స్కూలు పిల్లలు ఫుట్‌బాల్ ఆడుకోవడం కనిపిస్తూంది. స్టేషను ప్రాంతాల్లో దగ్గరే ఎక్కడో సినిమాపాటలు వినిపిస్తున్నాయి.

కొంతసేపటి క్రితం వదలివచ్చిన స్వగ్రామం మీదికి, నిన్నటిరోజున జరిగిన పెళ్ళి చూపులపైకి జారుకున్నాయి ఆలోచనలు. ఇంటివద్ద నాకు అన్నయ్య, వదిన అమ్మ మాత్రం వున్నారు. అన్నయ్య స్కూలు చదువులకు మించి చదవలేదు. తండ్రి మరణానంతరం ఇంటి యాజమాన్యం మీద పడడంవలన వ్యవసాయం చూసుకుంటూ ఇంటిపట్టునే వున్నాడు. ఆయన ఏదో అర్జంటు విషయంగా రమ్మని వ్రాస్తే నాలుగురోజుల క్రిందటె స్వగ్రామంవెళ్లి తిరిగి వస్తున్నాను. మావూరు తాలూకా కేంద్రమేకాక మంచి వ్యాపార కేంద్రమనికూడా ప్రతీతి.



బి. యస్సీ ప్రథమశ్రేణిలో పాసయినా నేను పైచదువులకు పోలేదు. కారణం. ఎంతచదివినా ఉద్యోగం చేయవలసిందే. ఎమ్మెస్సీ చదివితే అన్నయ్యకు ఇంకో రెండేళ్ళు శ్రమ ఇవ్వవలసి వస్తుంది. ఎమ్మెస్సీ చదివినా ఉద్యోగాలు రానివారిని కొంతమందిని నే నెరుగుదును. చదువులకు విలువతగ్గి ఉద్యోగానికే విలువవున్న రోజులు వచ్చాయని నేను గ్రహించాను. కనుక పరీక్షలు పూర్తి అయినప్పటినుండి ఉద్యోగాన్వేషణ చేయగా ఆరునెలలకు వున్న వూరికి రెండువందలమైళ్ల దూరంలో బ్యాంకులో మంచిపనే దొరికింది. ఆరంభం చిన్నదే అయినా మున్ముందు పురోగమించడానికి ఎక్కువ అవకాశాలు వున్న వుద్యోగమది. పనిలో చేరినప్పట్నుండి అవకాశ మొచ్చినప్పుడంతా అమ్మ నాపెళ్లివిషయం కదిలిస్తూనే వుంది. ఆమె అరోగ్యం కొంత బాగుండక పోవడంవల్ల ఇటీవల ఈ విషయంలో ఆమెకు ఆతురత మరీ ఎక్కువయింది.

ఊరు చేరిన రోజు అన్నయ్య ముక్తసరిగా చెప్పినదాన్నిబట్టి తెలిసింది— మా వూళ్లోనే బట్టలకొట్టు, కొంత వ్యవసాయం ఆస్తివున్న వ్యక్తి గోపాలరావు. అతనికిద్దరు కూతుళ్లే సంతానం. రెండవ అమ్మాయికి పెళ్లికావలసివుంది. నన్ను పిలిపించిన కారణం పెళ్లిచూపులు. అన్నయ్య బయట కెళ్లిన తర్వాత వదిన చెప్పిన మాటలను బట్టి తెలిసింది. ఆ అమ్మాయి వదినకు తెలుసుట. పేరు వసంత. వయసు పదహారు పదిహేడేళ్లు వుంటుంది. చాలా మంచి పిల్లే కాక బలే అందమయిందికూడ. ఈ సంబంధం వదలుకోడానికి ఏకారణమూ లేదు.

మనిషి జీవితంలో మరువలేని మధురమైన విషయాల్లో పెళ్లిచూపులు ఒకటి. కారూపు రేఖల్నిగూర్చి స్నేహితులు తదితరులు పలువురు వ్యక్తపరచిన అభిప్రాయాలు ఇదివరకు వినివున్నాను కనుక నేను నచ్చకపోవడం అనేప్రశ్న పెళ్లిచూపుల్లో సాధారణంగా వుండదని నాకుతెలుసు. మాతో వచ్చిన మధ్యవర్తి మాకు గోపాలరావుకు వుమ్మడి బంధువు. మాటకారి. అందరి బదులూ ఎడతెరిపిలేకుండ అతడే మాట్లాడేస్తున్నాడు, నవ్విస్తున్నాడు. ఆమాటలమధ్య రోజాపూల సువాసన గుప్పుమంటి. మొద

# ఎక్కవలసినరైలు

టగా నాకు కనిపించింది పారాణితో అలంకరింపబడి గడపదాటి వస్తున్న అందమైన ఒకపాదం. తల దించుకొని వదిన ప్రక్కనే నడచివస్తున్న ఆ అమ్మాయి ముఖం అప్పుడు నాకు పూర్తిగా కనుపించలేదుగాని అనడక తీరులో ఆకర్షణ వుందనిపించింది. 'ఎంత వరకు చదువుకున్నావు? పేరేమి?' వగయిరా అమ్మఅడిగిన ప్రశ్నలకు చిన్నగా ఏవో సమాధానా లిచ్చింది ఆ అమ్మాయి. వెళ్లిపోయే ముందు ఒకే ఒకసారి మాత్రం తలయెత్తి నావైపు చూసింది. ముఖంలో ఎంతోకళ, అందం వుంది. పెద్దవయిన ఆ కళ్లు తమ మూగభాషలో ఏదో సందేశాన్ని నాకిచ్చాయి అనిపించింది. అందాన్నిచూసి పరవశించిన నా మనసులో కల్గిన భావం మాత్రమే అది.

ఇంటికి తిరిగివచ్చిన మీదట కట్నాలు, కానుకలు, ముహూర్తం తదితర విషయాలపై అమ్మఅన్నయ్య వదినలమధ్య సంభాషణ కొనసాగడంగమనించాను. 'ఊరికెళ్లి వారం రోజుల్లో ఏదోఒకటి నిర్ణయించి ఉత్తరం వ్రాస్తాను. అంతవరకు తొందర పడకుండా వేచివుండమని నా అభిప్రాయం వెలిబుచ్చాను. ఆమాటల్లో అర్ధమున్నట్టు వాళ్లకేమీ అనిపించలేదు. పిచ్చివాడి మాటలను విన్నట్లు ఆశ్చర్యంగా నావంక చూశారు అమ్మ, అన్నయ్య. నిజమే ఈ సంబంధం వద్దనుకోవడానికి కారణమేదీ లేకపోవడం వాస్తవమే. భానుమతి అధ్యాయమింకా ముగియలేదని, భానుమతినుండి ఏదో వర్తమానం వస్తుందని నా హృదయాంతరాళంలో ఒక భావమింకా వుంది. అందుకే ఈ విషయాన్నిగూర్చి సావధానంగా, ప్రశాంతంగా ఆలోచించిగాని ఏ నిర్ణయము చేయదలచుకోలేదు.

ఆలోచనల్లో కాలగమనాన్ని నేను గమనించలేదు. నే నెక్కవలసిన రైలు స్టేషనులోకొచ్చి నిలిచింది. ప్లాటుఫారమంతా తిరిగి కోలాహలం. ప్రతివారిలో తొందర, హడావిడి. గజిబిజిగా వుంది జనసమూహం. ఆలశ్యమయిపోయిందనే ఆదుర్దాతో వడివడిగా వెళ్లి ఒక పెట్టె తలుపుదగ్గర చేరుకున్నాను. ఊచ అందుకొని రైలెక్కే ప్రయత్నంలో వుండగా ప్రక్కనవున్న మొదటి తరగతి పెట్టెలోనుండి దిగుతూ కనిపించింది భానుమతి. కాసేపు అచేతనుణ్ణయ్యాను. ఆమె నన్ను చూడలేదు. ఆమె వెంట ఎవరో పెద్ద వయసున్న స్త్రీ కూడ రైలు దిగింది. రైలెక్కే ప్రయత్నం మాని దిగివచ్చి వారిని చూస్తూ నిలుచున్నాను.

* * *

నా స్కూలు చదువంతా వున్న ఊళ్లోనే సాగిపోయింది. కాలేజిలో డిగ్రీ చదువుకు మాత్రం వూరొదలి రావలసొచ్చింది. కాలేజిలో, హాస్టల్లో ఫీసులు కట్టడం పూర్తి చేశాను. కొత్త వూరు, కొత్త కాలేజి, అందరూ కొత్తవాళ్లే. అప్పటికింకా స్నేహితులెవ్వరులేరు. క్లాసులింకా ప్రారంభం కాలేదు. పనేమిలేదు. కాలేజంతా చూడాలని వరండాల వెంబడి తిరుగుతున్నాను. ఇంగ్లీషు డిపార్టుమెంటు ప్రాంతంలో పూలకుండీలు అమర్చబడి వున్నాయి. ఒక కుండీలోని మొక్కకున్న వికసించిన ఎర్రగులాబీ పూవు నాకెంతో అందంగా కనిపించింది. ఎన్నోకోట్ల వ్యయంతో కొన్నివేలమంది శ్రమిస్తే తాజమహలు తయారైంది. ఎంతో అద్భుతంగా వుంటుందంటారు. ఈ హంగులన్నీ లేకుండా సృష్టించబడిన, ఈ గులాబీ పూవులో అంత అందం లేదా? అనిపించింది. సెలయేటిలో గులకరాళ్లమీదుగా ప్రవహిస్తున్న నీటి శబ్దంవలె కిలకిలమని శ్రావ్యమైన నవ్వు చిన్నగ వినిపించింది నా వెనుక. తిరిగి చూడగా ఇద్దరమ్మాయిలు నాజూగ్గా నడచి వస్తున్నారు. నవ్వు తాలూకు అందమైన అమ్మాయి నా వైపు క్షణకాలం వింతగా చూసింది. ఆకుపచ్చని రవిక, అదే రంగు వూలున్న పావడపై తెల్లని పయిట, ముఖంమీద పడుతున్న ముంగురులు, జడలో మల్లెపూలు, చేతికి వాచి వున్నాయి. అదే భానుమతిని నేను మొదటిసారి చూడ్డం.

ఆ అమ్మాయి నేను క్లాస్‌మేట్స్ కావడం వలన తర్వాత ఎన్నోమార్లు చూడవలసి వచ్చింది. పుస్తకం పురుగును కాకపోయినా చదువుమీద నా కెక్కువ శ్రద్ధ వుండేది. స్నేహితులు, సినిమాలు, తిరుగుళ్లు, అల్లరి తక్కువ. ఒకరిద్దరు మాత్రమే స్నేహితులు. అన్నిటిలో మొదటిమార్కు, తప్పితే రెండవమార్కు వస్తూవుండేది సాధారణంగా. భానుమతి చదువులో యూనివర్శిటి

కన్నా కొంచెం తక్కువే. కాని క్లాసులో వున్న అమ్మాయిల జట్టుకు లీడర్. చిలిపితనం అల్లరిపాలెక్కువ. వేష భాషలనుబట్టి ధనవంతురాలనిపించేది. అమ్మాయిల విషయంలో నాకు చొరవ తక్కువ. వారికి నేనెప్పుడు దూరదూరంగా జారుకునేవాణ్ణి.

నేనంటే భానుమతికి అదో తమాషా, అలుసు. ఎందుకో బోధపడేది కాదు. మొదటి సంవత్సరం నేనెదురైనప్పుడంతా భానుమతికెందుకో నవ్వు వచ్చేది. తల దించుకొని బలవంతంగా నవ్వాపుకుంటూ నడిచిపొయ్యేది. ప్రక్క నెవరైన అమ్మాయి వుంటే ఆమెకూ వచ్చేది నవ్వు. రెండవ యేడాది శృతి మించింది. నా వెనుక ఎప్పుడైనా అమ్మాయిల జట్టు వస్తూవుండడం తటస్థిస్తే 'శ్రీ రామచంద్రుడు' అనేది భానుమతి. స్నేహితురాళ్ళ బృందం నవ్వేది. నాకు ఇబ్బందిగా వుండి వేగం హెచ్చించేవాడిని. 'భలేరాముడు', 'బండరాముడు' 'యింటి రామారావు' వగైరా కూడ వినిపించేవి అడపాదడపా.

రెండవ సంవత్సరాంతంలో కాలేజి వార్షికోత్సవం పాటలపోటీలో పాల్గొన్నాను.

# ఎక్కవలసిన రైలు

ప్రథమ బహుమతి వచ్చింది. ఆరోజున సాయంత్రం అమ్మాయిలజట్టు ఎదురైనప్పుడు సగర్వంగా నిలుచున్నాను.

'కంగ్రాచులేషన్స్! రామారావుగారూ మీరు పాడగలరని మాకెవరికి ఇంతవరకు తెలియదండి,' అంది భానుమతి. 'థాంక్యూ,' అన్నాను ధైర్యంగా. ఆతర్వాత నన్నుచూసి అమ్మాయిలు నవ్వడంలాంటివి చాలావరకు తగ్గిపోయినయ్.


మూడవయేడు ఆరంభంలో మా క్లాసంతా ఒకసారి పిక్నిక్కెళ్ళాము. అందరు ఏదో ఆడుతున్నారు, పాడుతున్నారు, గంతులేస్తున్నారు కొందరు. నేను నారూంమేట్ గెస్ట్‌హౌస్ వరండాలో కుర్చీలేసుకొని చెస్స్ ఆడుతున్నాము. 'మేము ఆడుతాము రండి! డబుల్స్‌గేం బాగుంటుంది.' అంటూ భానుమతి ఆమెస్నేహితురాలొకరు వచ్చారు. భానుమతి నేను ఒకజట్టు మిగత ఇద్దరు ఒకజట్టుగా మిక్సెడ్ డబుల్స్ ఆడాము లంచ్‌కి పిలుపొచ్చేవరకూ. ఆ తర్వాత కాలేజిలో 'రామారావుగారు! మీ ఫిసిక్సు రికార్డొకసారి ఇస్తారా' అనో లేక ఇంకేవో పుస్తకాలు అడిగి తీసుకొంటూ వుండేది తరచూ. 'రేపు మనకు కెమిస్ట్రీ క్లాసు వుందా?' అనో 'ఈ క్లాసు మహా బోర్ కదండి?' అనో ఏవో ప్రశ్నిస్తూ వుండేది. 'మీకు ఫస్ట్‌మార్కు లెలా వస్తాయో కాని నాకు మహా తలనొప్పిగ వుందండి ఈ ఫిసిక్సు. కనీసం పాసు మార్కులు రావడానికైనా కొన్నిహింట్స్ చెప్పగూడదూ మీరు', అని అడిగిందొకసారి. అనవసరంగా ఎక్కువ చొరవ తీసుకొని మాట్లాడుతున్నట్లు అనిపించేది అప్పుడప్పుడు. ఏమైనా ఎగతాళిచేయడం మానడం వలన మూడవ సంవత్సరం హాయిగానే గడిచింది. పరీక్షలై వెళ్లేముందొకసారి ఎప్పుడైన తమాషాకు ఏదైన అని మిమ్మల్ని ఇబ్బంది పెట్టివుంటే మరచిపోతారుగదూ', అంది నవ్వుతూ. 'తప్పకుండా,' అన్నాను నేను.

ఊరికొచ్చిన తర్వాత అప్పుడప్పుడు భానుమతి ఆమె అందమైన నవ్వు గుర్తుకొచ్చేవి. ఆమెను తిరిగి చూడ్డం తటస్థించి వుండకపోతే కాలగమనంతో నేనామెను మరచిపోయివుండేవాణ్నను కుంటాను.

ఉద్యోగంలో చేరడానికి ఇంకో కొత్త వూరికి రావలసొచ్చింది. ఒకగది అద్దెకు తీసుకొని హోటల్లో భోంచేస్తూ వుంటున్నాను. ఉద్యోగం సజావుగ సాగిపోతూవుంది. విరామ సమయంలో పుస్తకాలు చదవడం, పత్రికలు చదవడం, చిన్నరచనలు చేయడం సినిమాలు చూడ్డం చేస్తున్నాను. ఈ ఏకాంత జీవితంలో ఒక తీయదనం వున్నట్టనిపించేది. ఉద్యోగం చేయడం ప్రారంభించిన తర్వాత సిగ్గుపాలు తగ్గి కొత్తవాళ్లతోనయినా నిస్సంకోచంగామాట్లాడ్డం, చొరవ అలవాటుపడినాయి క్రమేణ.

'బ్యాంక్ డే' సెలెబ్రేషన్స్ జరిగాయి ఒకనాడు. ఆ రోజు వుద్యోగులంతా కుటుంబ సమేతంగా వచ్చారు. అతిథులు అందరు కలిసి స్త్రీ జనాభా ఎక్కువేవుంది. కార్యక్రమంలో నాదొకపాట చేర్చబడింది. స్టేజిమీద పాడుతూ మధ్యలో చూశాను, మొదటివరుస ప్రేక్షకుల్లో కొందరు స్త్రీలమధ్య భానుమతిని. నేను చూసినప్పుడు నవ్వింది. అదే అందమయిన నవ్వు.

ఫంక్షన్ ముగిసేటప్పటికి రాత్రి పది



గంటలు దాటింది. వెళ్ళిపోతున్న జనానమూ హంతో భానుమతి మేనేజరుగారితో అతని కారులో కూర్చోవడం చూశాను. మరునటి రోజు ఆఫీసులో పనిచేసుకుంటూండగా మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో నన్ను మేనేజరుగారు రమ్మన్నారని కబురు చెప్పాడు.

'నిన్న నీపాట చాలా బాగుంది, మిస్టర్ కుమారావ్' అన్నాడు మేనేజరు.

'థాంక్యూసర్'

'నీవు మా అమ్మాయి భానుమతి కాలేజిలో క్లాస్‌మేట్స్ అని చెప్పింది. నీకే మైన క్లాస్ వచ్చిందా బియస్సీలో ?'

'అవునండి. ఫస్ట్‌క్లాస్ వచ్చింది'

'నీవు ఫస్ట్‌క్లాస్‌లో పాసయితే మా అమ్మాయి అక్కడ కూర్చుంది. 'ఫిసిక్సులో పోయింది. తిరిగి ఈ మార్చికి పరీక్ష వ్రాయబోతూ వుంది. పాసయినా కాకున్నా నేను ఏరవారేమనుకో. డిగ్రీతో చేయవలసిం దేమీలేదు. ఫిసిక్సులో కొన్ని సందేహాలున్నా యని నీచే కోచింగ్ ఇప్పించవని చెప్పింది. శ్రమ అనుకోకుండా ఈ కొద్దిరోజులు సాయంకాలంపూట కొంతసేపు మా ఇంటికి వస్తూ వుండాలి'

'సరేనండి' అన్నాను.

'నీకు పెళ్ళయిందా ?'

'ఇంకా లేదండి.'

'ఎక్కడుంటున్నావు వూళ్ళో.'

'గది అద్దెకు తీసుకొని ఒక్కణ్ణే వుంటున్నానండి. భోజనం హోటల్లో.'

'తప్పకుండా ఈసాయంకాలం నుండే రా,'

అట్లాగే సరేనని వచ్చేశాను.

మేనేజరు ఇల్లెక్కడో విచారించి తెలుసుకొని ఆ సాయంత్రమే వెళ్ళాను. మేనేజరు ఎదురు పిల్చుకెళ్ళాడు. తిరిగి నన్ను కలుసుకున్నందుకు, వాళ్ళతండ్రి ఆఫీసులోనే ఉద్యోగం చేస్తున్నందుకు ఎంతో సంతోషం వెలిబుచ్చింది భానుమతి. నావూరు, కుటుంబ విషయాలు అడిగి తెలుసుకొని తనను గూర్చి చెప్పుకుంటూండగానే ఎనిమిదిగంటలయ్యింది ఫిసిక్సు పాఠాలు ప్రారంభించకుండానే శలవు తీసుకున్నాను. ఆ తర్వాత ఫిసిక్సు పాఠాలు చెప్పేవాడిని ప్రతిరోజూ. ఫిసిక్సయ్యాక ఎన్నో విషయాలమీద సాగేది మా సంభాషణ. మేనేజరు గతి తప్పకుండ ప్రతిసాయంత్రం క్లబ్బుకెళ్ళేవాడు. ఒక్కో రోజు నేనుండగానే తిరిగి వచ్చేవాడు. అలా అలా భానుమతికీ నాకు సన్నిహితం


తల్లినుండి పిల్లకు పారంపర్యా 'వుడ్‌వార్డ్స్' వార్త వాడుకగా వస్తోంది

మీ శిశువును


# వుడ్‌వార్డ్స్

గ్రైప్ వాటర్‌తో

## ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

తరతరాలనుంచి తెలివైన తల్లులు తమ శిశువులకు 'వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్‌ను వాడియున్నారు. 'వుడ్‌వార్డ్స్' కడుపులో పట్టు నొప్పి, పైత్యం, వాయువు మరియు పళ్ల వచ్చునప్పటి జబ్బులు, ఈ బాధల నుండి తక్షణ విముక్తి కలిగిస్తుంది.






సురక్షితంగా వుండండి. నిబ్బరంగా వుండండి. సర్వదా ఒక సీసాను దగ్గిరుంచుకోండి.

'వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్ తెలివైన తల్లులు వంద ఏళ్లకు మించి వాడుచున్నారు.

AT 3

పెరిగిపోయింది. భానుమతిని కలుసుకున్న ఘడియలే రోజులో ముఖ్యమైన అంశంగా మధురమైన కాలంగా మారిపోయింది నా దినచర్యలో. రోజంతా ఆ సమయంకోసం ఎదురు చూసేవాణ్ని. అందుకు భానుమతి అందం ఆకర్షణ మేనేజరు క్లబ్బుకు వెళ్ళిపోవడం కూడా కారణాలు. ఏకాంతంగ వుండడంవలన ఎప్పుడు భానుమతిని గూర్చే తలపోస్తూ వుండడం పరిపాటి అయిపోయింది. నేనంటే భానుమతికి ఆకర్షణ వుందని రోజురోజుకు నాకు నమ్మిక ఏర్పడుతూ వుంది. ఈ భావాలన్నీ నా ప్రయత్నం లేకుండానే నాలో కలుగుతున్నాయి. అయినా నేనొక మంచిపని చేశాను. భానుమతిని గురించిగాని, భానుమతితో నా సన్నిహిత పరిచయాన్ని గురించిగాని ఆఫీసులో ఏ మిత్రునితోను ఎప్పుడూ ప్రస్తావించలేదు. అందుకు నా నిదానం, ముందు చూపు, ఉద్యోగంమీద ప్రేమ, సంస్కారం కారణాలనుకుంటాను.

## ఎక్కవలసిన రైలు

ఒకసారి మాటల సందర్భంలో భానుమతి తన మేనత్త కొడుకు లండన్‌లో చదువుకుంటున్నట్టూ కొన్నిరోజుల్లో చదువు పూర్తిచేసి రానున్నట్టూ చెప్పింది. ఆ రోజు నాకెందుకో మనసులో పెద్ద వెలితి ఏర్పడింది. అన్నం సహించలేదు. రాత్రంతా నిద్దురపట్టక ఆలోచనలతో గడిపాను. అందని ద్రాక్షపండుకొరకు అర్రులు చచుతున్నానా అనిపించింది. నాకు తెలియకుండానే నా హృదయంలో భానుమతి బలీయమైన చోటు చేసుకుందని మాత్రం నిశ్చయంగ గ్రహించానా రాత్రి. ఇందుకు బాధ్యత నా ఒక్కడిదేనా ? భానుమతి ఎంతవరకు బాధ్యురాలు అని తర్కించుకున్నాను ఎంతో సేపు. ఏమైనా, ఆ రోజునుండి నాలో ఆతురత, చొరవ వద్దనుకున్నా అదుపు తప్పి ఎక్కువయినాయి. దాని పర్యవసానమే ఒకనాటి సాయంత్రం చిరుచీకట్లో గది మధ్యన నేను భానుమతి గాఢ పరిష్వంగంలో చేరిపోయాము. మా నాలుగు పెదవులు ఏకమైనాయి. పొడిదగ్గు వినిపించినట్లయింది. కంగారుగా విడిపోయాము. అస్తవ్యస్తమయిన ఆలోచనలతో అర్థంకాని భావాలతో వడివడిగా బయటకు నడిచాన్నేను. గదిదాటిన తర్వాత ఎక్కడో లీలగా చుట్ట పొగవాసన నాకు సోకినట్లనిపించింది.

మరురోజు ఆఫీసులో పన్నెండు గంటలకు తాకీదు అందింది. నాలుగువందల మైళ్ల దూరంలోవున్న వూరిలో బ్రాంచికి బదిలీ. ఆరోజే ఆ ఆఫీసునుండి విడుదల...ఉద్యోగం నాకు ముఖ్యం. తొందరపాటుగ మూర్ఖంగా ప్రవర్తించి తీరని నష్టం పొందదలచుకోలేదు. ఇతరులకు హాని కలుగచేయ దలచుకోలేదు. అందుకే ఆర్డర్సు మేరకు క్రొత్త చోటులో వెళ్లి చేరాను. ఈ గొలుసు ఇంతటితో తెగిపోలేదని ఏదో జరుగుతుందని అర్థంలేని ఆశ ఒకటి నాలో ఒకమూల చోటు చేసుకుంది. ఆ అనిశ్చితకాలంలోనే అన్నయ్య దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది.

* * *

ఇప్పుడు యిక్కడ భానుమతి తారసిల్లుతుందని నే ననుకోలేదు. నా సమస్యను ఆమె పరిష్కరించగలదు. చూస్తున్నానేగాని ఏం చేయాలో తోచలేదు. ఎవరో కారు డ్రైవరులా వున్నతను పెట్టెలు తీసుకొని వెళుతున్నాడు. అతని వెనుక భానుమతి ఆమె వెంటవున్న ముసలావిడ వెళ్ల ముద్యుక్తులైనారు. అప్రయత్నంగా నేను వాళ్లవైపు నడిచాను. అప్పుడు కనిపించింది—భానుమతి కాలివేలికివున్న మెట్టె. ఒక్కక్షణం ఆశ్చర్యం కలిగింది. కాని మరుక్షణమే తేరికపడిన మనసుతో వెనుదిరిగి వచ్చేశాను.●

---

కూరలూ గుజ్జాలూ !

## గొఱ్ఱె మాంసం

మేకపోతు మాంసం ప్రశస్త మయినది. బలము, వీర్యపుష్టి, దేహపుష్టి నిస్తుంది. పిత్త, వాత రోగులకు మేలు చేస్తుంది. [illegible] చేస్తుంది. కఫాన్ని పెంచుతుంది.

గొర్రె మాంసం అపథ్యమయినది. జ్వరవ్యాధి, గ్రహణి రోగము గలవారు [illegible] అది [illegible]మయినది.

గొర్రె మాంసంయొక్క దుర్గుణాలకు విరుగుడు —1. ఉప్పు, 2. సిరకా, 3. ఆవాల చూర్ణం, 4. జాజికాయ, 5. నీరుల్లి, 6 గరమసాలా.

## ఊరపంది మాంసం

ఊరపందిమాంసం శరీరానికి సత్తువ నిస్తుంది సుఖ విరోచనాన్ని గావిస్తుంది. పైత్యాన్ని అణుస్తుంది.

గురుత్వంగా వుంటుంది అగ్నిమాంద్యం, కఫం, వాతం చేస్తుంది. ఇది అపథ్యకరమయినది

దీనియొక్క అరతులం ఎత్తు క్రొవ్వులో 2 చిన్నముల ఎత్తు ఆగాకర దుంప చూర్ణం కలిపి యిచ్చిన మూలవ్యాధి తగ్గుతుంది.

దీని దుర్గుణాలకు విరుగుళ్ళు.— 1 కలి, 2 తుమ్మచెక్కరసం లేదా కషాయం 3. యవక్షారము, 4 మజ్జిగ, 5 తరవాణి.

## అడవిపంది మాంసం

అడవిపందిమాంసం, వూరపంది మాంసం కన్నా వేగం జీర్ణమవుతుంది. శరీరానికి కాంతిని బలాన్ని యిస్తుంది వీర్యపుష్టి నిస్తుంది. క్షయ రోగులకు పైత్యరోగులకు, మేలు చేస్తుంది

మూర్ఛరోగులకిది మిక్కిలి అపథ్యకర మయినది. గురుత్వం అగ్నిమాంద్యం. వాతం, చేస్తుంది దుష్ట వ్రణములను పుట్టిస్తుంది. బాగా చెమటను పుట్టిస్తుంది బాగా మూత్రాన్ని గావిస్తుంది

దీని దుర్గుణాలకు విరుగుళ్లు —1. యవక్షారము, 2. మజ్జిగ, 3. తరవాణి,

## దుప్పి మాంసం

దుప్పి మాంసం కొద్దిగా వేడి చేస్తుంది. దేహపుష్టిని, వీర్యపుష్టిని యిస్తుంది. శరీరాన్ని దృఢంగా ఉంచుతుంది. శీఘ్రంగా జీర్ణమవుతుంది.

గుల్మరోగం, విద్రధియును నాభివ్రణం, శూల, వాత పిత్తములు, కఫం వీనిని తగ్గించడానికి తోడ్పడుతుంది. దీని తోక తినకూడదు. దీని తోకలో విషముంటుంది ఉష్ణ తత్వంగల శరీరులకిది అపథ్యకరమయినది.

దుప్పిమాంసంయొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:—1. నెయ్యి 2. తేనె.

సేకరణ ఆకుండి నారాయణమూర్తి.